# విజయవంతం చేయాలి

- రేపు కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ
- బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్



బోధన్‌లో సీఎం కేసీఆర్ సభాస్థలం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, బోధన్ సిట్టింగ్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్, నవంబర్ 13: బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 15న బుధవారం మధ్యాహ్నం బోధన్ పట్టణంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ కోరారు. సోమవారం బోధన్‌లోని తన నివాస గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు బోధన్‌కు వస్తారని, ఈ సభకు సుమారు 70 వేల మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ బోధన్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషిచేశారని, ఆయన ఇచ్చిన సుమారు రూ.1300 కోట్లతో నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని షకీల్ అన్నారు. ఆసరా పింఛన్లు, రైతుబంధు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ తదితర సంక్షేమ పథకాల కింద నియోజకవర్గంలోని ప్రజల ఖాతాల్లో రూ.1570 కోట్లు జమ అయ్యాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషిచేసిన కేసీఆర్‌ను మరోసారి సీఎంగా చేసేందుకు, బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను మళ్లీ ఆశీర్వదించేందుకు సభకు ప్రజలు తరలిరావాలని కోరారు. సీఎం కేసీఆర్ సభ తర్వాత తాను మండలాలవారీగా అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో గ్రామాలవారీగా తన ఎన్నికల ప్రచారాల షెడ్యూల్‌ను విడుదలచేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, డీసీసీబీ డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, గింజుపల్లి శరత్, బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ ఎడపల్లి, రెంజల్, నవీపేట్ మండలాల అధ్యక్షులు డి.శ్రీరామ్, భూమ్‌రావు, నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు ఎల్లయ్య యాదవ్, పోల్కి నర్సింలు, భవానీపేట్ శ్రీనివాస్, ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



బలరాంనాయక్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే షకీల్

### సభాస్థల పరిశీలన

పట్టణ శివారులోని నర్సాపూర్ క్రాస్‌రోడ్స్‌కు సమీపంలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ స్థలాన్ని సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలంలో చేపడుతున్న వివిధ నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. సభాస్థలంలో ఏర్పాట్లపై స్థానిక బీఆర్ఎస్ నాయకులు, పోలీస్ అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ విషయమై ఆయన సూచనలు ఇచ్చారు. ఎమ్మెల్యే షకీల్ వెంట బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకుడు ఎం.ఏ.రజాక్, డీసీసీబీ డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహిమూద్, నర్సింగ్‌రావు, తెడ్డు పోశెట్టి, నాగన్‌పల్లి మధు, భవానీపేట్ శ్రీనివాస్, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

### బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సమక్షంలో సోమవారం పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ బోధన్ మండల ఊట్‌పల్లి గ్రామానికి చెందిన బలరాంనాయక్‌ను ఇటీవల కాంగ్రెస్ నాయకులు వారి పార్టీలోకి బలవంతంగా చేర్చుకోగా తిరిగి బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. బోధన్‌లోని ఎమ్మెల్యే నివాసగృహంలో బలరాం నాయక్‌కు ఎమ్మెల్యే షకీల్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎడపల్లి మండలం ఏఆర్‌పీ క్యాంప్ గ్రామానికి చెందిన వడ్డెర సంఘం నాయకుడు రాములు, ఎస్సీ సంఘం నాయకుడు శంకర్ కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. పలు సంఘాల నాయకులు సోమవారం తరలివచ్చి ఎమ్మెల్యే షకీల్‌కు మద్దతును తెలిపారు.

## ప్రజలను మోసం చేసేందుకే 'ఆరు గ్యారెంటీలు'



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్.రాంకిషన్‌రావు

నవీపేట, నవంబర్13: 1969లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తొలిదశ ఉద్యమాన్ని అణచి వేసేందుకు 1972లో సిక్స్ పాయింట్ ఫార్ములాను ప్రవేశపెట్టి నీరు గార్చిందని, అదే తరహాలో తెలంగాణ ప్రజలను మరో సారి మోసం చేసేందుకు ఆరు గ్యారంటీల పథకాన్ని తెరపైకి తీసుకు వచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.రాంకిషన్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దాస్ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని అన్నారు. 15 ఏండ్లపాటు అధికారంలో ఉన్న సుదర్శన్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధిని విస్మరించారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా షకీల్‌ను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బీడీ దాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నవీపేట సొసైటీ మాజీ చైర్మన్ కే.సాయిబాబాగౌడ్, సీనియర్ నాయకుడు తెడ్డు పోశెట్టి, నవీపేట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు లోకం నర్సయ్య, బాబూరావు, భవంతి సుదర్శన్, రాజేందర్ పాల్గొన్నారు.

## జోరుగా బీఆర్ఎస్ ప్రచారం



దూపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు



నవీపేట మండలం నాళేశ్వర్‌లో ..

రెంజల్/నవీపేట, నవంబర్ 12: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్‌ను గెలిపించాలని కోరుతూ రెంజల్ మండలంలోని దూపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ప్రచారం చేపట్టారు. మాజీ సర్పంచ్ సుదర్శన్ యాదవ్, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. నవీపేట మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. కోస్లీ గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నవీపేట సొసైటీ వైస్ చైర్మన్ దొంత ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో, నాళేశ్వర్‌లో బినోలా సొసైటీ వైస్ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

### నేరుగా ఫిర్యాదు చేయాలి

శక్కర్‌నగర్, నవంబర్ 13: బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల వ్యయపరిశీలకురాలు(ఐఏఎస్ అధికారి) తాన్యాసింగ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలవు దినాలను మినహాయించి, మిగతా అన్ని పనిదినాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల తాను బోధన్ పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. నేరుగా కలిసేందుకు వీలుపడని వారు 83320 21892 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

### పేకాట రాయుళ్ల అరెస్టు

నవీపేట, నవంబర్ 13: మండలంలో దీపావళి పండుగ సందర్భంగా పేకాట ఆడుతున్న 22 మందిని అరెస్టు చేసి నగదుతోపాటు పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నారాయణపూర్‌లో ఐదుగురిని అరెస్టు చేసి రూ. 6180 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జన్నేపల్లిలో ముగ్గురిని అరెస్టు చేసి రూ. 1720, కమలపూర్‌లో ఏడుగురిని అరెస్టు చేసి రూ. 3.510, బినోలాలో ఏడుగురిని అరెస్టు చేసి రూ.38వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

**రెంజల్ మండలంలో..**

రెంజల్, నవంబర్ 12: మండలంలో ఆది, సోమవారాల్లో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి రూ. 9,320 నగదు తోపాటు 12 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎవరైనా పేకాట ఆడితే 8712659874 నంబర్‌కు సమాచారం అందించాలని, వారి పేర్లను రహస్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

### 8 నామినేషన్ల తిరస్కరణ

బోధన్, నవంబర్ 13: బోధన్ నియోజకవర్గం నామినేషన్ల స్క్రూటినీ సోమవారం సాయంత్రం ముగిసింది. నియోజకవర్గం నుంచి నామినేషన్లు దాఖలుచేసిన మొత్తం 23 మంది అభ్యర్థుల్లో 8 నామినేషన్లను వివిధ కారణాలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. బోధన్ నియోజకవర్గ అభ్యర్థులుగా 15 మంది బరిలో ఉన్నామిగిలారు. ఈ అభ్యర్థులు ఈనెల 15న బుధవారం సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవటానికి ఎన్నికల యంత్రాంగం గడువు ఇచ్చింది. నామినేషన్ల తిరస్కరణ అనంతరం బోధన్ నియోజకవర్గం బరిలో ఉన్న అభ్యర్థుల్లో మహ్మద్ షకీల్ ఆమేర్ (బీఆర్ఎస్), పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్), వడ్డీ మోహన్‌రెడ్డి (బీజేపీ), ముమ్మలనేని అమర్‌నాథ్‌బాబు (బీఎస్పీ), పసులోటి గోపికిషన్ (శివసేన), దేవర్ల నాగరాజ్ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), మోసీన్ (ఎంసీపీఐ), సాయం మురళి (ధర్మ సమాజ్ పార్టీ), పానిగంటి రజితావాణి (పిరమిడ్ పార్టీ), ఇతరులు, స్వతంత్ర అభ్యర్థులు మహ్మద్ షర్ఫీల్ పర్వేజ్, హన్మాజీ భూపాల్‌రెడ్డి, జునైద్ అహ్మద్ ఖలీల్, షేక్ జలీల్, సయ్యద్ అస్గర్, ఆకులపల్లి సుదర్శన్‌రాజ్ ఉన్నారు.

### మన్మథ్‌స్వామి ఆలయానికి పాదయాత్ర ప్రారంభం

శక్కర్‌నగర్, నవంబర్ 13: బోధన్ పట్టణం జంగం గల్లీలోని పురాణే (పొడయ్య) మఠం, పురాణే అజయ్‌కుమార్ నివాసం నుంచి సోమవారం శ్రీ క్షేత్ర కపిలధార మన్మథ్‌స్వామి ఆలయానికి పాదయాత్ర సోమవారం ప్రారంభమైంది. ఈ పాదయాత్రను కాలనీవాసుల సౌజన్యంతో వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో సుంకిని సిద్ధేశ్వర మహరాజ్ ప్రారంభించారు. కార్తీక పౌర్ణమి రోజున మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఉన్న శ్రీ క్షేత్ర కపిలధార మన్మథ్‌స్వామి పుణ్యక్షేత్రానికి చేరుకోవడంతో పాదయాత్ర ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వీరశైవ జంగమ, లింగాయత్ ప్రముఖులు వీఆర్ దేశాయ్, నర్సింగప్ప, శ్యాంరావు, లక్ష్మణ్‌రావు పటేల్, సంతోష్ మహరాజ్ పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న మహిళలు

### మోదీకి వ్యతిరేకంగా మాల మహానాడు నిరసనలు

రెంజల్, నవంబర్ 12: మండలంలోని సాటాపూర్ గ్రామ తెలంగాణ చౌరస్తాలో సోమవారం మాల మహానాడు నాయకులు ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గైని కిరణ్, మండల యూత్ అధ్యక్షుడు అబ్బొల్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనలో డివిజన్ నాయకుడు సిద్ధ సాయిలు, కందారే రాము, రమేశ్, సాయిలు, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.